సాక్షి అనకాపల్లి

బుధవారం ၊ 21 ၊ మే ၊ 2025



మామిడి తాండ్ర పుల్లన

మామిడి తాండ్ర తయారీ తగ్గి దుకాణాలు వెలవెలబోతున్నాయి. పండ్ల దిగుబడి తగ్గడమే ఇందుకు కారణం. 8లో

ఉష్ణోగ్రతలు

మంగళవారం

	గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	34.8/25.0

రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త గౌరి మంగళవారం తెలిపారు.



చండీ హోమం

సీతంపేట: విశాఖ లలితా పీఠంలో పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా చండీ హోమం జరిపించారు.

న్యూస్‌రీల్

గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పాయకరావుపేట: పెంటకోట సముద్ర తీరానికి సోమవారం స్నానానికి వెళ్లి గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. సోమవారం సముద్రంలో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం ఉదయం గాలింపు కొనసాగించామని, తీరానికి 100 మీటర్ల దూరంలో మృతదేహాలను గమనించామని ఎస్ఐ జె.పురుషోత్తం తెలిపారు. పిల్లి అభిలాష్ (19), గంపల తారీష్ (17)ల మృతదేహాలను బయటకు తీసి, నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

ఐసెట్‌లో మెరుపులు

- టాప్‌టెన్‌లో ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి చోటు

విశాఖ విద్య: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశ పరీక్ష ఐసెట్–2025 ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ ఏడాది మొత్తం 32,719 మంది ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధించగా, విశాఖ జిల్లాకు చెందిన మేక మనోజ్ రాష్ట్రంలోనే నంబర్ వన్ ర్యాంకు సాధించి, రెండు తెలుగు రాష్ట్రాల్లో విశాఖ ఖ్యాతిని ఇనుమడింపజేశాడు. టాప్–10 ర్యాంకుల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు చోటు దక్కించుకోవడం విశేషం. అనకాపల్లి జిల్లాకు చెందిన షేక్ బషీరున్నీషా 6వ ర్యాంకు సాధించగా, పెదగంట్యాడ మండలంలోని శరగడ గణేష్ రెడ్డి 9వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. ఐసెట్ పరీక్షకు అనకాపల్లి జిల్లా నుంచి 169 మంది హాజరుకాగా, వారిలో 167 మంది అర్హత సాధించారు. ఉత్తీర్ణులైన వారిలో 120 మంది బాలికలు ఉన్నారు.

దొంకాడ దాడిపై డీఎస్పీ విచారణ



విచారణ నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నక్కపల్లి: దొంకాడలో దళితులపై తెలుగుదేశం పార్టీకి చెందిన అగ్రవర్ణాలు దాడి చేసిన ఘటనపై మంగళవారం నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు గ్రామంలో విచారణ నిర్వహించారు. వివాహ సమయంలో పెళ్లికొడుకు సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో దానిని మైక్, లైటింగ్ ఏర్పాటు చేసిన దళిత యువకులే తీశారంటూ పెళ్లికొడుకుతోపాటు అగ్రవర్ణాలకు చెందిన పలువురు వ్యక్తులు కర్రలతో దాడి చేసి విచక్షణారహితంగా కొట్టిన సంగతి తెలిసిందే. అగ్రవర్ణాల నుంచి తమకు ప్రాణహాని ఉందని, తమపై దాడి చేసి కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలంటూ బాధితులు సోమవారం నక్కపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు దొంకాడకు చెందిన సుమారు 14 మంది అగ్రవర్ణాల వారిపై పలు సెక్షన్లతో కూడిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబులు మంగళవారం ఘటనా స్థలానికి, ఎస్సీ కాలనీకి వెళ్లి బాధితులను విచారించారు. దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఫిర్యాదు చేసిన వారితోపాటు, దాడిలో గాయపడిన వారి నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. విచారణను వీడియో చిత్రీకరించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గ్రామంలో అగ్రవర్ణాల వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. బాధితులకు ధైర్యం చెప్పి మరోసారి బుధవారం విచారణకు వస్తామన్నారు. ఇరువర్గాల వారు సంయమనం పాటించాలన్నారు. గ్రామంలో డీఎస్పీ విచారణ అనంతరం దళిత సంఘాల ప్రతినిధులు, బాధితులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి బూర్తి ఏసయ్య, దళిత నాయకుడు రాజేష్, కూరపాటి అప్పారావు, మాజీ ఎంపీటీసీ విది కుమారి కన్నారావు, కుంచా రమణ, వీది సత్యనారాయణ, నొక్కి అప్పారావు, నాసా సంస్థ ప్రతినిధి శాంతి కుమారి తదితరులు మాట్లాడుతూ దాడి చేసిన వారిలో కొంతమంది పేర్లు ఎఫ్ఐఆర్ నుంచి తప్పించే ప్రయత్నాలు, కేసును నీరుగార్చే కుట్ర జరుగుతుందన్న అనుమానాలు వ్యక్తం చేశారు. నిందితులను కాపాడేందుకు కొంత మంది టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం వచ్చిందని, అదే గనుక జరిగితే దళిత సంఘాలన్నీ ఏకమై రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతాయని బూర్తి ఏసయ్య తెలిపారు.

భంగపడ్డ గంగపుత్రులు

వేష నిషేధ భృతి మంజూరులో అవకతవకలు

"అచ్యుతాపురం మండలం పూడిమడక పంచాయతీ పరిధిలో అర్హత ఉన్న 300 మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతి రాలేదు. మొత్తం 367 బోట్లు రిజిస్టర్ అయినవి ఉన్నాయి. ప్రతీ బోటుకు ఆరుగురు ఉంటారు. అందులో ఐదుగురు అర్హులకు మాత్రమే భృతి వచ్చింది. ఆరో వ్యక్తిగా కూటమి నేతలు తమకు అనుకూలమైన వ్యక్తి పేరును నమోదు చేసుకున్నారు. ఇలా అర్హత ఉండి రాని వారు.. వాడమొదల తాతారావు (బోట్ నెం.ఏపీ-వీ3-ఎండీ-120), మద్దు మత్తురాజు (బోట్ నెం.ఏపీ-వీ3-ఎండీ-120), తెడ్డు అప్పన్న (బోట్ నెం.ఏపీ-వీ3-ఎండీ-159), కంబాల మౌళి (ఏపీ-వీ3-ఎండీ-120), వాడమొదల సత్తియ్య (ఏపీ-వీ3-ఎండీ-61), వాడమొదల నూకరాజు(ఏపీ-వీ3-ఎండీ-1688)"

➡ పూడిమడకకు చెందిన కౌవిరి బాపయ్య అనే మత్స్యకారుడికి ఒక్క సెంటు భూమి కూడా లేదు. కానీ ఆయనకు 80 ఎకరాల భూమి ఉన్నట్లు చూపించి నిషేధ భృతి ఆపేశారు. ఎందుకు రాలేదని సచివాలయ ఉద్యోగులను అడిగితే నీ పేరు మీద 80 ఎకరాలున్నట్లు చూపిస్తోందని చెప్పే సరికి బాపయ్య ఒక్కసారిగా అవాక్కయ్యాడు. ఇలా ఒకటి కాదు రెండు కాదు చాలా మంది అర్హులైన మత్స్యకారులకు ఏదో ఒక కారణం చూపించి నిరాకరించారు.





- అర్హత ఉన్నవారిని కాదని అనర్హులకు నిషేధ భృతి
- గత లబ్ధిదారుల్లో కొందరికి నిలిపివేత
- బోటులో వేటకెళ్లే మత్స్యకారుల బృందంలో ఒకరిద్దరి పేర్లు కూటమి నేతలకు అనుకూలురవే
- జిల్లా వ్యాప్తంగా 1580 మంది మత్స్యకారులకు నిలిచిపోయిన భృతి
- అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

సాక్షి, అనకాపల్లి: మత్స్యకారుల సేవలో.. అని పేరు పెట్టారు. చివరకు వారి కడుపు కొట్టారు. అధికారంలోకి వచ్చాక తొలి సంవత్సరం వేట నిషేధ భృతి ఎలాగూ ఇవ్వలేదు. కనీసం రెండో సంవత్సరమైనా పద్ధతిగా ఇచ్చారా.. అంటే అదీ లేదు. భృతి అందుకున్న లబ్ధిదారుల వివరాలు సేకరిస్తే కళ్లు చెదిరే వాస్తవాలు బయటపడుతున్నాయి. ఎందరో అనర్హులు లబ్ధి పొందినట్టు తేటతెల్లమయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో 'మత్స్యకార భరోసా' పొందిన వారిలో అర్హత ఉన్న సుమారు 2 వేల మందికి ఈసారి భృతి అందలేదు. ఒక్కో బోటులో అర్హత లేని కూటమి పార్టీల అనుకూల మత్స్యకారులకు భరోసా కల్పించారు. వేట మీదే ఆధారపడి జీవించే గిరిపుత్రులకు అన్యాయం చేశారు. దీనిపై కలెక్టర్‌కు, జిల్లా మత్స్యకార అధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. వేట నిషేధ కాలంలో అప్పులు చేసి, కాలం గడుపుతామని, భృతి మంజూరులో రాజకీయం చేసి తమ కడుపు కొట్టడం అన్యాయమని గంగపుత్రులు వాపోతున్నారు. తీరంలో ఉన్న ఆరు మండలాల పరిధిలోని 31 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. 12,644 మత్స్య కుటుంబాలు కేవలం చేపల వేట, విక్రయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి.

కూటమికి అనుకూలంగా ఉన్నవారికే భృతి

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకముందు వేట నిషేధ భృతి మొక్కుబడిగా అందించేవారు. రూ.5 వేల చొప్పున నిషేధం ముగిసిన చాలా కాలానికి ఇచ్చేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక భృతిని రూ.10 వేలకు పెంచడమే కాక ఠంచనుగా వేట నిషేధ సమయంలో అందించేవారు. కూటమి పార్టీలు ఆ పరిహారాన్ని రెట్టింపు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినా.. దాన్ని మొదటి ఏడాది విస్మరించారు. రెండో ఏడాది ఇచ్చినా తీరని అన్యాయం చేశారు. రీసర్వే పేరిట అర్హులను తొలగించి, తమకు అనుకూలంగా ఉన్నవారికి లబ్ధి చేకూర్చారు.

చేదు వాస్తవాలు

➠ 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 11,500 మంది మత్స్యకారులకు నిషేధ భృతి అందించారు. 2024లో కూటమి ప్రభుత్వం మత్స్యకార భరోసా కల్పించలేదు.

➠ 2025లో జిల్లాలో నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో 11,544 మందికి రూ.23.28 కోట్లు భృతి అందించారు.

➠ వీరు కాకుండా అర్హత ఉన్న సుమారుగా 1580 మందికి మత్స్యకారులు వేట నిషేధ భృతి రాలేదు. వీరిలో అచ్యుతాపురం మండలంలో 400 మంది మత్స్యకారులు, రాంబిల్లి, పరవాడ మండల పరిధిలో 200 మంది, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల పరిధిలో 400 మందికి పైగా మత్స్యకారులు ఉన్నారు.

➠ విద్యుత్ బిల్లులు ఎక్కువగా వచ్చాయని, కార్లు, భూములు ఉన్నాయని లేకపోయినా ఉన్నట్లు చూపించి సుమారు 500 మంది మత్స్యకారులను అనర్హులుగా పక్కన పెట్టారు.

పేదవారితో రాజకీయమా?



అర్హత ఉన్న మత్స్యకారులందరికీ నిషేధ భృతి ఇవ్వాలి. వేటకెళ్లే వారెవరో.. వెళ్లని వారెవరో సచివాలయంలో ఉన్న అధికారులకు తెలియదా..? వారికి అన్నీ తెలిసే స్థానిక కూటమి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో విధులు నిర్వహిస్తున్నారు. వేటకెళితేగానీ పూటగడవని మత్స్యకారులున్నారు. అలాంటి వారికి ఇవ్వాల్సిన భృతిని కూడా నిలిపివేసి రాజకీయాలు చేస్తున్నారు.

– ఉమ్మిడి జగన్, మత్స్యకార నాయకుడు, పూడిమడక

ఉద్యమిస్తాం..



కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వానికి మత్స్యకారుల ఓట్లే కావాలి.. వారి సమస్యలు, వెతలు వినపడవు. వేట నిషేధ భృతి మొదటి ఏడాది ఇవ్వలేదు. రెండో ఏడాదిలో జిల్లాలో సుమారుగా 1500 మందికి అందలేదు. ఎన్నికల్లో కూటమి పార్టీలకే మత్స్యకారులు ఎక్కువగా ఓట్లు వేశారు. నమ్మిన వారిని మోసం చేయడం తగదు. అర్హులకు వేట నిషేధ భృతి అందకపోతే ఉద్యమానికైనా సిద్ధమే.

– చోడిపల్లి శ్రీనివాసరావు, మాజీ మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్

బోటుకు రెండు అనధికార పేర్లు..



రిజిస్ట్రేషన్ అయిన ప్రతి బోటుకు ఒకటి లేదా రెండు అనర్హుల పేర్లు చేర్చారు. వారికి నిషేధ భృతి ఇచ్చారు. ఈ అవకతవకల్లో స్థానిక కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు కూడా భాగస్వాములుగా ఉన్నారు. మత్స్యకార భరోసాకు అర్హత ఉన్న సూరాడ కోదండరాం అనే బోట్ ఓనర్‌కు కూడా భృతి రాలేదు. అధికారులు పరిశీలించి అర్హులైన అందరికీ భృతి అందించాలి.

– వాసుపల్లి శ్రీనివాసరావు, మత్స్యకారుడు, పూడిమడక

టెక్నికల్ సమస్య కారణంగా కొందరికి రాలేదు

వేట నిషేధ భృతి అర్హత ఉన్న ప్రతీ మత్స్యకారుడికీ ప్రభుత్వం అందించింది. చిన్నపాటి టెక్నికల్ సమస్య కారణంగా కొందరికి రాలేదని మా వరకూ వినతులు వచ్చాయి. అర్హత ఉండి భృతి రాని వారందరి నుంచి దరఖాస్తులు కోరుతున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అందిస్తాం.

– ప్రసాదరావు, మత్స్యకార జిల్లా జేడీ

తల్లీబిడ్డ అవస్థలు



అమ్మ అయిన ఆ సంతోషం కళ్లల్లో నిండాలి. పసిబిడ్డను అక్కున చేర్చుకొని, ప్రభుత్వ వాహనంలో సురక్షితంగా ఇంటికి చేరుకోవాలి. కానీ తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమ్మె ఆ ఆశలపై నీళ్లు చల్లింది. వాహనాలు నిలిచిపోవడంతో బాలింతల అవస్థలు పడ్డారు. మంగళవారం కేజీహెచ్‌లో డిశ్చార్జ్ అయిన చోడవరం ఎడ్లవీధికి చెందిన సౌందర్య జ్యోతికి కూడా అదే పరిస్థితి ఎదురైంది. బిడ్డతో ఆటోలో ఇంటికి వెళుతున్న ఈ దృశ్యం, సమ్మె కారణంగా సాధారణ పౌరులు ఎదుర్కొంటున్న కష్టాలకు అద్దం పట్టింది. సౌందర్య జ్యోతి ఒక్కరే కాదు, ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్లాల్సిన ఎంతో మంది తల్లులు, పసిబిడ్డలతో కలిసి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి ఆశలకు భంగం కలిగి, ప్రభుత్వ సేవలు అందక, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

–మహారాణిపేట/–ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నాలుగు నెలలుగా పస్తులు

- జీతాలు చెల్లించక తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల అవస్థలు
- ఒక రోజు సమ్మెతో నిరసన బాట పట్టిన బాధితులు



నెహ్రూచౌక్ వద్ద తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల నిరసన

అనకాపల్లి: ఆస్పత్రుల్లో ప్రసవం అయిన తర్వాత బాలింతలను వారి పసికందులతో సహా క్షేమంగా ఇంటికి చేరుస్తున్నామని, ఎంతో బాధ్యత గల విధులు నిర్వహిస్తున్న తమను పస్తులతో ఉంచడం తగదని 102 తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఒకరోజు సమ్మె నిర్వహించారు. నెహ్రూచౌక్ వద్ద నిరసన ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ కనీస వేతనాలు అమలు చేయడం లేదని, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ఉద్యోగుల జీతాలు చెల్లించడంలో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 4 మాసాలుగా జీతాలు లేక అప్పులు చేసి కుటుంబాన్ని పోషించే పరిస్థితి ఏర్పడిందని, నేషనల్ హెల్త్ మిషన్ కల్పించుకోవాలన్నారు. యూనియన్ జిల్లా నాయకులు నర్సింగరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

పట్టపగలే చోరీలు

- నలుగురు నిందితుల అరెస్టు
- 7.5 తులాల బంగారం, 28 తులాల వెండి వస్తువులు స్వాధీనం



నిందితుల వద్ద లభించిన బంగారు వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న దేవరాపల్లి మండలం ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన చొడువాడ దేముడునాయుడిని మార్టూరు గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. తమ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మార్టూరు జంక్షన్ వద్ద ఇటీవల కాలంలో వరుసగా ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిగా గుర్తించామన్నారు. ఇతని వద్ద మొత్తం 5 కేసులలో చోరీకి గురైన 7.5 తులాల బంగారం, 28 తులాల వెండి వస్తువులు, కెనాన్ కెమెరా, రూ.1,500లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ.8 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ, పగటి వేళ దొంగతనాలకు పాల్పడేవాడని ఆయన పేర్కొన్నారు. చిన్నతనంలోనే తండ్రి మృతి చెందడంతో నిందితుడు జులాయిగా తిరుగుతూ, చెడు వ్యసనాలకు బానిసై, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి చర్యలకు లోనై తన స్నేహితులతో కలసి ఈ చోరీలకు పాల్పడినట్లు ఆయన చెప్పారు. అనంతరం ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రశంసాపత్రాలతో అభినందించారు.

నర్సీపట్నం టౌన్ పీఎస్ పరిధిలో...

నర్సీపట్నంలోని శారదానగర్‌లో ఒంటరిగా నివసిస్తున్న రాళ్లపల్లి వెంకట లక్ష్మి గృహంలో ఈనెల 16న చొరబడి, ఆమెపై దాడి చేసి, బంగారు, వెండి ఆభరణాలను అపహరించిన అదే గ్రామానికి చెందిన ఉలబాల విజయకుమార్, కెల్ల సతీష్, పత్రి నారాయణమ్మలను నర్సీపట్నం మండలం బలిఘట్టం టి–జంక్షన్ వద్ద అరెస్టు చేశామని ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు ఆభరణాలు 10 తులాలు, బంగారు గొలుసు 3 తులాలు, బంగారు గాజులు 7 తులాలు, బంగారు ఉంగరం తులం, వెండి దీపం కుందులు 19.370 తులాలు ముగ్గురు నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం ప్రతిభ కనబర్చిన పోలీస్ సిబ్బందిని ప్రశంసా పత్రాలతో ఎస్పీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైమ్) ఎల్.మోహనరావు, అనకాపల్లి ఇన్‌చార్జ్ డీఎస్పీ బి.మోహనరావు, అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, రూరల్ ఎస్ఐ జి.రవికుమార్, సెంట్రల్ క్రైం పోలీస్ స్టేషన్ సీఐ అప్పలనాయుడు, ఎస్ఐలు పి.రమేష్, చోడవరం సీఐ పి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం 8లో

ఆన్‌లైన్ ట్రాపింగ్ ముఠా గుట్టురట్టు!

- భోగాపురంలో అర్ధరాత్రి సోదాలు
- పలు అపార్ట్‌మెంట్లపై దాడులు
- 20 వాహనాల్లో వచ్చిన పోలీసులు



పోలీసు సోదాలు జరిగిన అపార్ట్‌మెంట్



దాడుల్లో పాల్గొన్న పోలీసు వాహనాలు

అచ్యుతాపురం రూరల్: అచ్యుతాపురానికి కూతవేటు దూరంలో ఉన్న భోగాపురం గ్రామంలో.. మంగళవారం రాత్రి అందరూ నిద్రలోకి జారుతున్న వేళ.. బిలబిలమంటూ 20 పోలీసు వాహనాలు వచ్చాయి.. అక్కడున్న అపార్ట్‌మెంట్లను చుట్టుముట్టాయి.. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు స్థానికంగా కొన్ని ఫ్లాట్లను అద్దెకు తీసుకుని సాఫ్ట్‌వేర్ కంపెనీ పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు అందిన సమాచారంతో పోలీసులు దాడి జరిపినట్టు సమాచారం. నిందితులు ఆన్‌లైన్ ద్వారా గ్యాంబ్లింగ్, ఆన్‌లైన్ ట్రాపింగ్ వంటి అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు మంగళవారం అర్ధరాత్రి సుమారు 20 వాహనాలతో పోలీసులు వచ్చి సోదాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వ్యక్తులు రాత్రి వేళల్లో విచ్చలవిడిగా మద్యం, మత్తు పదార్థాలు సేవిస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు చెప్పారు. పలువురు అక్కడ వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పూర్తి విచారణ చేపట్టి అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ తనిఖీలకు సంబంధించి బుధవారం అన్ని విషయాలు తెలియజేస్తామని పోలీసులు స్థానిక విలేకర్లకు తెలిపారు. అయితే పోలీసులు సమాచారం ఇవ్వడానికి నిరాకరించగా, విషయం తెలుసుకునేందుకు ప్రయత్నించిన సాక్షి విలేకరిపై దురుసుగా ప్రవర్తించి, చేతిలో ఉన్న మొబైల్‌ను లాక్కున్నారు.

ఉప మేయర్‌గా దల్లి ఏకగ్రీవం



ఉప మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరెడ్డిని అభినందిస్తున్న కూటమి నేతలు

డాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ ఉప మేయర్‌గా కూటమి తరఫున జనసేన కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియకు ప్రిసైడింగ్ అధికారిగా జేసీ మయూర్ అశోక్ వ్యవహరించారు. గోవిందరెడ్డి పేరును టీడీపీ నుంచి పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, బీజేపీ నుంచి ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రతిపాదించారు. పోటీ లేకపోవడంతో ఎన్నికల అధికారి గోవిందరెడ్డికి నియామక పత్రం అందించారు. అనంతరం ప్రమాణస్వీకారం చేయించారు.

ముందు జాగ్రత్త!

ఉప మేయర్ ఎన్నికలో సోమవారం నాటి సీన్ రిపీట్ కారాదని జాగ్రత్త పడ్డారు. అసంతృప్త సభ్యుల్ని ముందుగానే రప్పించి మేయర్ చాంబర్లో కూర్చోబెట్టారు. మేయర్ పీలా శ్రీనివాసరావు తన చాంబర్ నుంచి లిస్ట్ ప్రకారం టిక్ పెట్టి మరీ సభ్యుల్ని కౌన్సిల్ హాల్లోకి పంపారు. ముందు రోజు దుమ్మాకొట్టిన వారికి బుజ్జగింపులు, తాయిలాలు అందినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం


బయ్యవరం వద్ద రోడ్డు ప్రమాదంలో నుజ్జు అయిన కారు


ప్రమాదంలో మృతి చెందిన బుంగా వెంకట నరసమ్మ

కశింకోట: మండలంలోని బయ్యవరం పాల డెయిరీ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఎస్ఐ లక్ష్మణరావు అందించిన వివరాల ప్రకారం...విశాఖపట్నం నుంచి నరసాపురం వెళుతున్న కారు, బయ్యవరం పాల డెయిరీ వద్ద అవతలి రోడ్డులోకి అకస్మాత్తుగా మలుపు తిరుగుతున్న లారీని వేగంగా ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న బుంగా వెంకట నరసమ్మ (72) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. కుమారుడు నరేష్, మేనకోడలు సువర్ణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు వైద్యులు సిఫారసు చేశారు. విశాఖలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న నరేష్, తమ తల్లి నరసమ్మ, కుటుంబ సభ్యులు సువర్ణ, ముగ్గురు పిల్లలతో కలిసి కారులో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో బంధువుల ఇంటికి పెళ్లికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. నరసమ్మ మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జయి దెబ్బతింది. తన కళ్లముందే తల్లి నరసమ్మ మృతి చెందడంతో నరేష్, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మామిడి తాండ్ర పుల్లన


మామిడి తాండ్ర తయారు చేస్తున్న దృశ్యం

- తగ్గిన మామిడి దిగుబడి
- తాండ్ర తయారీకి వెనకడుగు
- పెరిగిన ముడిసరుకు, తయారీ ఖర్చులు
- గిట్టుబాటు కాక ఏర్పాటు కాని దుకాణాలు

నక్కపల్లి : ప్రతి ఏటా మామిడి సీజన్‌లో ఏర్పాటయ్యే తాండ్ర తయారీ దుకాణాలు రెండేళ్ల నుంచి కానరావడం లేదు. నక్కపల్లి మండలంలో మామిడి తాండ్ర తయారీ దుకాణాలు కొన్నేళ్లుగా ఎక్కువగా ఏర్పాటు చేసేవారు. ఈ సీజన్‌లో నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో మామిడి తాండ్ర తయారీ కానరాలేదు. నక్కపల్లి మండలంలో వేంపాడు, చినదొడ్డిగల్లు, కాగిత, రేబాక, రమణయ్యపేట, తదితర ప్రాంతాల్లో మామిడి తాండ్ర తయారీ అధికంగా జరిగేది. ఈ ప్రాంతాల్లో సుమారు 15 వరకు మామిడి తాండ్ర దుకాణాలు ఏర్పాటు చేసేవారు. మామిడి గుజ్జును తాండ్రగా తయారు చేసి స్థానికంగా విక్రయించడంతో పాటు, ఇతర ప్రాంతాలకు సుమారు 50 నుంచి 100 టన్నుల వరకు ఎగుమతి చేసేవారు. తాండ్ర తయారీపై చుట్టు పక్కల సుమారు 100 మంది వరకు ఉపాధి పొందేవారు. మరో 50 మంది వరకు తాండ్రను కాగిత టోల్‌ప్లాజా వద్ద కిలోల చొప్పున ప్యాక్ చేసి బస్సుల్లోను, కారుల్లోను వెళ్లేవారికి విక్రయించేవారు. అలాగే చుట్టుపక్కల గ్రామాల్లో సైకిళ్లపై వెళ్లి విక్రయించేవారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా మామిడి కాయల దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో దాదాపు 15 వేల హెక్టార్లలో మామిడితోటలు ఉన్నాయి. చాలా తోటల్లో పూతదశలో తెగుళ్లు రావడం, పొగమంచు కారణంగా మామిడి కాయలు కాయలేదు. దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో ఈ ఏడాది మామిడి పండ్లకు గిరాకీ పెరిగింది. దిగుబడి ఎక్కువగా ఉన్న సమయంలో కలెక్టర్, సువర్ణరేఖ, నీలం, దేశవాళీ, బంగినపల్లి, రసాలు వంటి రకాలను కొనుగోలు చేసి గుజ్జు చేసి తాండ్ర తయారీకి ఉపయోగించేవారు.

ధరలు చూస్తే బేజారు..: మామిడి దిగుబడి తగ్గిపోవడంతో ధర కూడా విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం కలెక్టర్ మామిడి కాయలు టన్ను రూ.35 వేలు ఉంది. బంగినపల్లి రకాలయితే టన్ను రూ.40వేల వరకు ఉంది. సువర్ణరేఖ రూ. 50 వేలకు పైబడే ఉంది. దీంతో తాండ్ర తాయారీకి వెనుకడుగు వేస్తున్నారు. రసాలు, దేశవాళీ, ఇతర జాతులకు చెందిన మామిడి కాయలు సైతం టన్ను రూ.20 వేల పైబడి మాటే. అంత ధర పెట్టి కాయలను కొనడంతో పాటు ముడిసరకులు, ఇతర ఖర్చులకు గిట్టుబాటు కాదని భావించిన వ్యాపారులు ఈ ఏడాది తాండ్ర తయారీకి స్వస్తి పలికినట్టు సమాచారం. కార్మికులకు వేతనం రూ.500 నుంచి రూ. 800 వరకు చెల్లించాల్సి వస్తుంది. స్థానికంగా ఉండే కమీషన్ వ్యాపారులు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసిన మామిడి కాయలను తాము అనుకున్న ధర రావడంతో దేశవాళీ, కలెక్టర్, ఇతర జాతులకు చెందిన రకాలను జ్యూస్‌ల కోసం ఎగుమతి చేస్తున్నారు. దీంతో తాండ్ర తయారీకి అవసరమైన మామిడి కాయలు అందుబాటు ధరల్లో లభించడం లేదు. ఈ ధరలకు కాయలు కొని తాండ్ర తయారు చేసినా అధిక ధరలకు విక్రయించాల్సి ఉంటుంది. దీంతో అమ్మకాలు తగ్గిపోతాయి. గత ఏడాది మామిడి తాండ్ర కిలో రూ.500 ఉంటే ఈ ఏడాది రూ. 800లకు విక్రయిస్తే తప్ప గిట్టుబాటు కాదు. పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. దీంతో నష్టాలను చవి చూడాల్సి వస్తుందని భావించి తాండ్ర తయారీకి స్వస్తి పలికినట్టు తయారీదారులు చెబుతున్నారు.

గిట్టుబాటు కాని తాండ్ర

చిన దొడ్డిగల్లు పరిసర ప్రాంతాల్లో గతంలో ఐదు మామిడి తాండ్ర దుకాణాలు ఉండేవి. రెండేళ్ల నుంచి దిగుబడి అంతంతమాత్రంగానే ఉండడంతో ముడిసరకు ధరలు పెరిగిపోయాయి. దీంతో తాండ్ర తయారీకి ఎవరూ ముందుకు రావడం లేదు. ఇక్కడ తయారు చేసిన తాండ్రను స్థానికంగా విక్రయించడంతో పాటు, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే వారు. ఈ ఏడాది ఒక్క దుకాణం కూడా ఏర్పాటు కాలేదు. కూలీలు కూడా తాండ్ర తయారీ లేక ఉపాధి పనులకు, భవన నిర్మాణ పనులకు వెళ్లిపోతున్నారు.

– **తోటసత్తిబాబు**, కమిషన్ దుకాణం నిర్వాహకుడు, చినదొడ్డిగల్లు

సారా బట్టీలపై దాడులు


దాడుల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

- 4500 లీటర్ల బెల్లం ఊట, 40 లీటర్ల సారా ధ్వంసం
- తయారీ సామగ్రి స్వాధీనం
- ఐదుగురిపై కేసు నమోదు

ఎటపాక: నవోదయం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఎటపాక మండలంలో సారా తయారీ కేంద్రాలపై ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు మూకుమ్మడి దాడులు నిర్వహించారు. విశాఖపట్నం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి ఆదేశాలతో మండలంలోని పిచుకలపాడు, గుండువారిగూడెం గ్రామాల్లో ఎక్సైజ్, సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు మంగళవారం ఆకస్మికంగా దాడులు జరిపాయి. దాడుల్లో 4500 లీటర్ల బెల్లం ఊట ,40 లీటర్ల సారా, 20 కేజీల పటిక సీజ్ చేశారు. గుండువారిగూడెం గ్రామంలో ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. సారా తయారీకి ఉపయోగించే 48 డ్రమ్ములను సామగ్రితో పాటు ధ్వంసం చేసినట్టు రంపచోడవరం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగరాహుల్ తెలిపారు. ఈ దాడుల్లో కొత్తగూడెం ఏఈఎస్ కరంచంద్, రంపచోడవరం ఏఈఎస్‌టీఎఫ్ సీఐ ఇంద్రజిత్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అప్పలనాయుడు, చింతూరు ఎక్సైజ్ ఎస్ఐ స్వామి, అనకాపల్లి సీఐ శ్రీనివాసరావు, భద్రాచలం ఎస్ఐ సీతారామరాజు, పాల్వంచ ఎస్‌హెచ్‌ఓ సరిత, ఎటపాక సీఐ కన్నపరాజు, ఇరు రాష్ట్రాల ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బండారు అప్పన్న మృతిపై డీఎస్పీ విచారణ


మృతుడు అప్పన్న తండ్రి మహాలక్ష్మి, కుటుంబ సభ్యులను విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం, వేములపూడిలో నవంబరు 5న చోటు చేసుకున్న బండారు అప్పన్న మృతిపై డీఎస్పీ పి.శ్రీనివాసరావు విచారణ జరిపారు. మృతుడి తండ్రి బండారు మహాలక్ష్మి, కుటుంబ సభ్యులు కేసును నీరుగార్చుతున్నారంటూ సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ మంగళవారం మృతుడి తండ్రి మహాలక్ష్మి, కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ముందుగా మృతుడి తండ్రిని, తరువాత కుటుంబ సభ్యులు గోవింద, చిన్ని, మంగను విడివిడిగా విచారించారు. కుమారుడుని కోల్పోయాను కేసు నీరుగార్చకుండా న్యాయం చేయాలని డీఎస్పీకి విన్నవించానని మహాలక్ష్మి తెలిపారు. కేసులో పురోగతి లేకపోవడం వల్లనే కలెక్టర్‌ను ఆశ్రయించానని, ఇప్పటికైనా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. కత్తిగాటు, కర్రతో కొట్టినట్టు ఉన్నప్పుడు రోడ్డు ప్రమాదమని ఎలా నమ్ముతామని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపితే దోషులు బయటపడతారనే నమ్మకం తనకు ఉందన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే తన కొడుకు మృతికి గల కారకులను బయటపెట్టి, తమ కుటుంబానికి న్యాయం చేయాలని డీఎస్పీని కోరడం జరిగిందని తెలిపారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో ఎస్పీ దంపతులు


ఎస్పీ దంపతులను సత్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్: మండలంలోని స్థానిక కొత్తూరు శారదానది ఒడ్డున ఉన్న చాలీసా అభయాంజనేయ స్వామి ఆలయాన్ని ఎస్పి తుహిన్ సిన్హా, మూడో అదనపు సివిల్ జడ్జి నికిత దంపతులు మంగళవారం సందర్శించారు. స్వామిని దర్శించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వయంగా ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు ఎస్పీ దంపతులను పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

ఆర్ఆర్ ప్యాకేజీ రూ.25 లక్షలు ఇవ్వాల్సిందే


చందనాడ గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

నక్కపల్లి : ఏపీఐఐసీకి భూములిచ్చిన రైతులు, నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు చెల్లించాల్సిందేనని పలువురు రైతులు కోరారు. మంగళవారం చందనాడ, అమలాపురం, మూలపర గ్రామాల్లో ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి అర్హత సాధించిన రైతులు, నిర్వాసితుల జాబితాలు ప్రకటించేందుకు గ్రామసభ నిర్వహించారు ఆర్డీవో రమణ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో ప్రభుత్వం ప్రకటించిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వివరాలను ఆర్డీవో వెల్లడించారు. ఐదు సెంట్ల ఇంటి స్థలంతో పాటు ప్యాకేజీ కింద రూ.8.30 లక్షలు నిర్ణయించడం జరిగిందన్నారు. దీనిపై రైతునాయకులు సూరాకాసుల గోవిందు,గంటా తిరుపతిరావు, తళ్ల భార్గవ్, తళ్ల అప్పలస్వామి, పెదకాపు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ చాలదన్నారు. పదేళ్ల క్రితం భూములు ఇస్తే ఇప్పుడు నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లిస్తున్నారని, అప్పటికీ ఇప్పటికీ మార్కెట్‌ధరల్లో చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు చెల్లించాలన్నారు. పెళ్లికాని మహిళలకు కూడా ప్యాకేజీ వర్తింపజేయాలన్నారు. డీఫారం భూముల్లో ఉన్న చెట్లక , వ్యవసాయ బోర్లకు, బావులకు సైతం నష్టపరిహారం చెల్లించాల్సిందేనన్నారు. ప్యాకేజీ వ్యవహారం తేల్చకుండా భూములు స్వాధీనం చేసుకుని పనులు ప్రారంభించడం తగదన్నారు. తహసీల్దార్ నర్సింహమూర్తి డీటీ నారాయణరావు, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడి హత్యకేసులో నిందితులు అరెస్టు

కశింకోట : ఉగ్గినపాలెం గ్రామంలో జరిగిన వృద్ధుడి హత్య కేసులో నిందితులు తండ్రి కొడుకులను 24 గంటల వ్యవధిలో పట్టుకొని మంగళవారం అరెస్టు చేశారు. అనకాపల్లి ఇన్‌ఛార్జి డీఎస్పీ బి. మోహనరావు జిల్లా ఎస్పీ కార్యాలయంలో విలేకరులకు అందించిన వివరాల ప్రకారం...ఉగ్గినపాలెంలో 300 గొర్రెల మంద పంపకంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం సందర్భంగా పక్కుర్తి అప్పలనాయుడు(60)ను ఒమ్మి నూకరాజు, కుమారుడు శ్రీను కలిసి కర్రలతో తలపై కొట్టి హత్య చేశారు. వారిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకొని అరెస్టు చేసినందుకు కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐలు బి.లక్ష్మణరావు, పి. మనోజ్‌కుమార్, సిబ్బందిని అభినందించారు.

130 కిలోల గంజాయి పట్టివేత

- ఒకరు అరెస్టు, ముగ్గురు పరార్


పట్టుబడిన గంజాయితో పోలీసులు

చీడికాడ: కారులో అక్రమంగా తరలిస్తున్న 130 కిలోల గంజాయితో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. ఆయన మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. గంజాయి అక్రమ రవాణా జరుతున్నట్టు అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం మండలంలోని ఖండివరం వద్ద మాటువేసి అటుగా వస్తున్న కారును అడ్డగించి తనిఖీలు నిర్వహించామన్నారు. ఆ కారులో రూ.ఆరున్నర లక్షల విలువ గల 130 కిలోల గంజాయిని గుర్తించామన్నారు. గంజాయి తరలిస్తున్న మండలంలోని బైలపూడికి చెందిన కాశీ తేజను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతనితో పాటు మరో ముగ్గురు పైలెట్‌లుగా వ్యవహరించినట్టు తెలిపారు. వారు పరారీలో ఉన్నారని తెలిపారు.

క్లుప్తంగా

4న తెలుగు రాష్ట్రాల సినీ గీతాల పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా వచ్చే నెల 4న యలయంచిలి గుర్రప్ప కల్యాణ మండపంలో ఉభయ తెలుగు రాష్ట్రాల సినీ గీతాల పోటీలను నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు మత్తుర్తి రామారావు తెలిపారు. పట్టణంలోని మంగళవారం ఆయన పాటల పోటీల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనే వారికి వయసుతో సంబంధం లేదన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు స్త్రీ, పురుషులందరూ పాల్గొనవచ్చని, ప్రవేశ రుసుంగా రూ.100 చెల్లించాలన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక నగదు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ కల్చలర్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం, డాక్టర్ సిహెచ్ ఎన్. అపర్ణ, బెన్నాభత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ పరిశీలన



కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కల్యాణ మండపంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీవో వి.వి. రవికుమార్ మంగళవారం పరిశీలించారు. అక్కడ అమలు జరుగుతున్న తీరును, సౌకర్యాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్. రామచంద్రరావు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగుతో అవస్థలు



మేదర వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగు

కశింకోట: స్థానిక మేదర వీధిలో రోడ్డుపై మురుగు నీరు పారుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురుగు కాలువలు నిండిపోయి నీరు పొర్లి రోడ్డుపై పారుతోంది. వర్షం పడితే ఇది మరింతగా పారడం వల్ల దుర్వాసన వచ్చి భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలువలకు మరమ్మతులు చేసి రోడ్డుపై మురుగు అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 545 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,290	4,910
రెండో రకం	3,910	4,320
మూడోరకం	3,300	3,710

అనకాపల్లి సినిమాలు

లెవన్	:రాజా
శుభం	:సత్యనారాయణస్క్రీన్-1
లవ్‌లీ	: సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
సత్యనారాయణ స్క్రీన్-2	:శుభం, (ఉదయం, మధ్యాహ్నం)
హిట్-3	:పర్రిసాయి
సింగల్	:షిర్డీసాయి
మన కుటుంబం	:వెంకటేశ్వర
అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి	:శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్	:రామచంద్ర

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 385 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 339 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 14 యూనిట్లు, బీ పాజిటివ్ -6, ఓ పాజిటివ్ -11, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706ను సంప్రదించాలని కోరారు.

సరుగుడు.. నష్టాలకు విరుగుడు



తలారివానిపాలెంలో సరుగుడు తోట

- పెరిగిన పెట్టుబడులకు ప్రత్యామ్నాయంగా సాగు
- ఆసక్తి చూపిస్తున్న రైతులు
- మండలంలో పెరుగుతున్న పంట విస్తీర్ణం

తుమ్మపాల: ఐరన్ వుడ్‌గా పిలిచే సరుగుడు సాగు మండలంలో క్రమక్రమంగా పెరుగుతోంది. చెరకు, వరి, కూరగాయలు, తదితర ఇతర పంటల పెట్టుబడి విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు అప్పులు పాలై భూములను అమ్ముకునే దుస్థితికి దిగజారిపోతున్నారు. మరికొందరు అప్పులు తీర్చుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వచ్చే సరుగుడు పంట మూడు నుంచి ఐదేళ్ల కాలంలో చేతికంది వస్తుంది. పైగా లక్షలాది రూపాయల ఆదాయం రావడంతో సరుగుడు సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇది వరకు అపరాలు, కూరగాయలు, తదితర పంటలు సాగు చేసే భూములు ఇప్పుడు సరుగుడు తోటలతో దర్శనమిస్తున్నాయి.

తగ్గిన చెరకు, వరి, పైరు పంటలు

చెరకు సాగుకు కేరాఫ్‌గా ఉండే గ్రామాల్లో ఇప్పుడు సరుగుడు విస్తరించింది. పైరు పంటల స్థానంలో సరుగుడు సాగు పెరిగింది. మండలంలో తుమ్మపాల, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, దిబ్బపాలెం, బవులువాడ గ్రామాల్లో చెరకు తప్ప మరో పంట ఉండేది కాదు. ఇప్పుడు చెరకు సాగుకు ముందుకు రావడం లేదు. పెరిగిన పెట్టుబడులతో పాటు నష్టాలు రావడంతో ఇప్పుడు ప్రత్యామ్నాయంగా సరుగుడు సాగుకు మక్కువ చూపిస్తున్నారు. మామిడిపాలెం, పాపయ్యపాలెం, కొండుపాలెం, మార్టూరు, రేబాక, సుందరయ్యపేట, కుంచంగి, కూండ్రం, గ్రామాల్లో పండించే వరి స్థానంలో సరుగుడు సాగు పెరిగింది. గొలగాం, అక్కిరెడ్డిపాలెం, గోపాలపురం, కోడూరు, తలారివానిపాలెం, పలు గ్రామాల్లో పూర్తిగా పైర్లకు సెలవులు ప్రకటించి రైతులంతా సరుగుడు, యూకలిప్టస్ సాగు చేస్తున్నారు. మండలంలో దాదాపు 2 వేల ఎకరాల వరకు సరుగుడు సాగవుతుందని అధికారుల అంచనాగా చెబుతున్నారు.

మూడు నుంచి ఐదేళ్లలో రెట్టింపు ఆదాయం

సరుగుడు సాగు చేస్తున్న భూముల్లో ఇతర పంటల సాగు ద్వారా వచ్చే ఆదాయం కన్నా సరుగుడు ద్వారా రెట్టింపు ఆదాయం లభిస్తుంది. సరుగుడు ఎకరాకు 70 నుంచి 100 టన్నుల వరకు దిగుబడి రావడం, టన్ను ధర అత్యధికంగా రూ.5 వేల వరకు పలకడంతో రైతులకు ఒక్కసారిగా ఆదాయం చేతికందుతుంది. మూడు నుంచి ఐదేళ్ల లోపు 35 నుంచి 45 అడుగుల ఎత్తు పెరగడంతో దళారులు రైతులకు మంచి ధరను అందించి తోటను ఎకరాల లెక్కన కొనుక్కుంటున్నారు. సరుగుడు కర్రను పేపర్, భవన నిర్మాణాలు, ఇతర అవసరాలకు వినియోగిస్తారు.



రెండేళ్లకే ఏపుగా ఎదిగిన సరుగుడు తోట

మెట్ట ప్రాంతాల్లోను తక్కువ పెట్టుబడితో సాగు

మండలంలో సగానికిపైగా గ్రామాలు మెట్ట ప్రాంతాలుగా ఉండి నీటి సాంద్రత తక్కువగా ఉంటుంది. వర్షాకాలం, చెరువులపై ఆధారపడే పంటలు సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయిన సందర్భాలు అనేకం. అదే సరుగుడు పంట నీటి కొరతను తట్టుకుని ఎటువంటి నష్టం వాటిల్లకుండా పెరుగుతుంది. కేవలం మొక్క నాటినప్పుడు మాత్రమే కొన్ని రోజుల పాటు రోజు తప్పించి రోజు నీరు పోయాలి. రెండు సార్లు గాబు, గప్పులు చేసి మొక్కను కాపాడితే చాలు ఏపుగా పెరిగి మూడు నుంచి ఐదేళ్లలో పంట చేతికందుతుంది. ఎటువంటి ఎరువుల, తెగుళ్ల ఖర్చు ఉండదు.

రైతుల చూపు సరుగుడు వైపే...

మొక్కను నాటి బతికించుకుంటే చాలు తర్వాత ఎలాంటి కరువు వచ్చినా తట్టుకోగలవు. నాటిన మొదటి సంవత్సరంలో అవి స్థిరపడటానికి నీరు అవసరం. నేల పొడిగా ఉంటే చెట్టుకు వారానికి ఒకసారి, అంతకంటే ఎక్కువసార్లు నీరు పెడితే చాలు. ఎక్కువ ఎరువులు అవసరం లేదు. ఫలదీకరణం చేయాలని ఎంచుకుంటే, నత్రజని, భాస్వరం, పొటాషియం సమాన మొత్తంలో సమతుల్య ఎరువులు రైతులు వాడొచ్చు. ఎంత పెట్టుబడి పెడితే అంతే అన్నట్లుగా సరుగుడు సాగు చేసుకోవచ్చు. అందుకే రైతులు ఇటీవల అధికంగా సరుగుడు సాగుకు మొగ్గు చూపుతున్నారు.

సరుగుడు సాగుతో ఆదాయం



విపరీతంగా పెరిగిపోయిన పెట్టుబడులకు భయపడి వ్యవసాయాన్ని వదులుకుని సరుగుడు సాగుకు దిగాను. సరుగుడు సాగుకు ఒక్కసారి పెట్టుబడి పెడితే చాలు మూడేళ్ల తర్వాత పంటను అమ్ముకుని ఆదాయం పొందవచ్చు. పంట కాలం మధ్యలో ఎటువంటి కరువు వచ్చినా పంటకు ఢోకా లేదు. కాస్త దిగుబడి తగ్గినా పంట మాత్రం పోదు. అదే పైరు, కూరగాయల సాగులో నిత్యం కష్టపడి శ్రమించాలి. నీటి కొరత ఏర్పడితే పంటను వదులుకోవాల్సిందే. రెండేళ్ల క్రితం వేసిన సరుగుడు ఇప్పుడు పదడుగుల వరకు పెరిగింది.

– దాసరి గోపాలరావు, తలారివానిపాలెం గ్రామం

కూరగాయల సాగుతో ఏటా నష్టమే

అష్టకష్టాలు పడి పండించిన కూరగాయలు మార్కెట్‌కు తీసుకెళ్తే రకరకాల కారణాలతో దళారులు తక్కువ ధరకు కొని వారు అధిక ధరకు అమ్ముకుంటున్నారు. ఇంటిల్లిపాది కష్టపడి పండించిన పంట ఆదాయం దళారులకే దక్కుతుంది. దుక్కు నుంచి నాట్లు, ఎరువులు, మందులు, గొప్పులు, నీరు తడి ఇలా అనేక రకాల సేవలు చేసినా ఫలితం మాత్రం శూన్యంగా ఉంది. కూరగాయల సాగుతో అప్పులు మాత్రమే మిగిలాయి. సరుగుడు సాగు మంచిదని తెలుసుకుని ఈ ఏడాది ఎకరా భూమిలో వేశాను.

– మంత్రి నాని, రేబాక గ్రామం, అనకాపల్లి మండలం

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని నిరసన



ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాలు

కశింకోట: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పలు ప్రజా, కార్మిక సంఘాలు నిరసన తెలిపాయి. స్థానిక సంతబయట నుంచి జాతీయ రహదారి మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని వినతి పత్రం అందజేశాయి. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్నాయని, కార్మికులకు నష్టం కలిగించే విధంగా వీటిని తీసుకు వస్తుందని విమర్శించారు. దీని దృష్ట్యా లేబర్ కోడ్ రద్దు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ సంఘాల ప్రతినిధులు తనూజ, కె. శాంతి, ఎం. శ్రీదేవి, ఎం. సత్తిబాబు, శివలక్ష్మి, షేక్ రెహమాన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించండి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందన్నారు. రైతులకు దీనిపై మార్కెటింగ్ ఎలా చేయాలో శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్నకు పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్, ఈఈ శేఖర్‌లకు సూచించారు.

విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: వర్ష సూచన ఉన్నందున, ముందస్తు ఖరీఫ్ పంటగా నువ్వులను వేసుకునే రైతులు వాతావరణ పరిస్థితులు గమనించి విత్తుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నువ్వులలో అధిక దిగుబడినిచ్చే, వై.ఎల్.ఎం-17, వై.ఎల్.ఎం-66, వంటి రకాలను ఎంపిక చేసుకుని, ఈ నెలాఖరులోపు, ఎకరానికి 2 కిలోల చొప్పున విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని సూచించారు. రాగల వర్షాన్ని వినియోగించుకొని ఖరీఫ్ పైరుగా సజ్జ, కొర్ర అపరాలు, వేరుశనగ వంటి పంటలను వేసుకోవడానికి నేలను తయారు చేసుకోవాలన్నారు. విత్తనాలు సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. ఖరీఫ్‌కి అనువైన వరి రకాలైన ఆర్.జి.ఎల్. 2537, ఎం.టి.యు 1310, 1321, 1232, 1262, 1061 వంటి రకాలను రైతులు ఎంపిక చేసుకొని విత్తనాన్ని సేకరించుకోవాలన్నారు. తేమను ఉపయోగించుకొని, 120 రోజుల వయసు గల చెరకు మొక్క కార్సి తోటల్లో, మొక్కల వరుసల మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వి.గౌరి, బి.భవాని, ఎ.శిరీష, వి. చంద్రశేఖర్, ఎ. అలివేణి పాల్గొన్నారు.

15 నుంచి సేవా కార్యక్రమాలు

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి విజయ రెసిడెన్సీలో వచ్చే నెల 15 నుంచి 22వ తేదీ వరకు కేంద్ర మాజీ మంత్రి, సినీ హీరో కె.చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ ఉపాధ్యక్షుడు గల్లా కొండలరావు తెలిపారు. మంగళవారం ఇక్కడ ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజులు పాటు పట్టణంలో నిరుపేదలకు పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చిరంజీవి ఫ్యాన్స్ గౌరవాధ్యక్షుడు శ్రీరామదాసు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జోరు వానలో సీహెచ్‌వోల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌వోలు

అనకాపల్లి: జోరు వానను సైతం లెక్కచేయకుండా తమ సమస్యలు పరిష్కరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నిరసన చేపట్టారు. స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రం ఎదురుగా డీసీఎంఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన వీరి నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆఫీసర్స్ జి.భవాని, జి.యమున, బి.సుధాకర్, రేవతి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. గ్రామీణ రోగులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా 425 మంది ఉద్యోగులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేకుండా పోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు టి.కల్యాణి, ఆర్.అప్పలనాయుడు, పి.రాజశేఖర్, సిహెచ్.స్వామి, కె.అశ్విని తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో వర్షం

కశింకోట: మండలంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిత్తడి వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై జల్లులుగా కురిసిన వర్షం వల్ల రోడ్లు బురదమయంగా మారాయి. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. వర్షం వల్ల వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

కోడూరు భూపరిహారంలో అవకతవకలు

విచారణ చేపట్టాలని సీపీఎం డిమాండ్



మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: మండలంలో కోడూరు గ్రామంలో సర్వే నంబర్ 20లో 31.38 ఎకరాలకు రూ.20 లక్షలు చొప్పున చెల్లించిన భూ పరిహారంపై బహిరంగ విచారణ చేపట్టాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. భూపరిహారం చెల్లింపులో అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం జమ చేసిన నగదును తిరిగి తీసుకోవాలని కోరారు. అర్హులను కాకుండా బినామీలను సాగుదార్లుగా నమోదుచేసి ప్రజాధనం దుర్వినియోగం చేయడం అన్యాయమన్నారు. పరిహారం చెల్లింపులో రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై కోట్లాది రూపాయలు బొక్కేశారన్నారు. అధికార, ప్రతిపక్ష నేతలు మౌనం విడాలని, ఏపీఐఐసీ భూముల్లో సాగుదారుల పేర్లను నమోదు చేసి పరిహారం చెల్లించి అవినీతిని ప్రోత్సహించడం సరికాదన్నారు. ఈ అవినీతి, అక్రమాల్లో బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బి.ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, కాళ్ల తేలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

50 శాతం ఫీజు రాయితీతో విద్య

మాకవరపాలెం : లయన్స్ క్లబ్ నర్సీపట్నం-నవ్య సౌజన్యంతో విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీతో విద్య అందించనున్నట్లు క్లబ్ కార్యదర్శి చైతన్య, అధ్యక్షులు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న మాంటిస్సోరి పాఠశాలను ఎంపిక చేశామన్నారు. ఈ పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 50 శాతం ఫీజు రాయితీలో విద్య అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాతంలో ఉన్న పేద విద్యార్థులకు తక్కువ ఫీజులతో విద్య అందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 30 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పారదర్శకంగా సర్వే



మాట్లాడుతున్న డీడీవో మంజులవాణి

కశింకోట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందేలా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అనకాపల్లి డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి (డీడీవో) ఎస్. మంజులవాణి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రభుత్వ మార్గదర్శకాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సర్వే పారదర్శకంగా జరగాలన్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో వి.వి. రవి కుమార్, ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తుప్పు పట్టిస్తున్నారు..



మట్టిలో కలిసిపోతున్న ప్లాకెయిన్ ముందుభాగం



విరిగిపోయిన చెత్త ఎత్తే ట్రాలీ బళ్లు

అనకాపల్లి టౌన్: మన సొమ్మేం కాదుగా ప్రజాధనమే కదా పోయేది అన్న తీరులో జీవీఎంసీ అధికారులు వ్యవహరిస్తున్నారు. లక్షలాది రూపాయల వస్తువులు మట్టిపాలవుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. స్థానిక జీవీఎంసీ కార్యాలయం వెనుక భాగంలో చెత్తను ఎత్తే ట్రాలీ బళ్లు, కాలువల్లో పూడిక తీసే పొక్లెయిన్ ముందుభాగం తుప్పు పట్టి మట్టిలో కలిసిపోతున్నా వినియోగంలోకి తీసుకురావడంలేదు. కొద్దిపాటి మరమ్మతులు చేపడితే వినియోగంలోకి తెచ్చే వస్తువులను పూర్తిగా పనికి రాకుండా చేశారు. ప్రజాధనం వెచ్చించి కొనుగోలు చేసిన వస్తువులను వాడుకలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బుచ్చయ్యపేట: స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం వడ్డాది గ్రామ శివారులో పేకాడుతున్న వారిపై ఎస్ఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.18,160 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

నర్సీపట్నం: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ యువతీ, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని కార్య నిర్వాహక సంచాలకులు ఎం.సత్యపద్మ తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ వై.జంక్షన్‌కు సమీపంలో ఉచిత భోజనంతో పాటు శిక్షణ ఇస్తామన్నారు. 76 రోజులు శిక్షణ ఉంటుందన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం

- కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణంలో 80 మంది భూనిర్వాసితులు



పార్లుపాలెంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

పెందుర్తి: గోపాలపట్నం నార్త్ సింహాచలం నుంచి కొత్తవలస వరకు రైల్వే ట్రాక్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా కలెక్టర్ వెల్లడించారని పెందుర్తి తహసీల్దార్ ఎం.ఆనంద్ కుమార్ రైతులకు తెలిపారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, అధికారుల మధ్య జరిగిన సమావేశంలో పరిహారం అంశం చర్చించారని చెప్పారు. మంగళవారం పార్లుపాలెంలో రైతులతో జరిగిన చర్చలో ఆయా విషయాలను తహసీల్దార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత స్థాయి సమావేశంలో రైల్వే ట్రాక్ సమీపంలో అనుభవం, సాగులో ఉన్న రైతులు దాదాపు 80 మంది వరకు ఉన్నట్లు గుర్తించారన్నారు. భూములు కోల్పోతున్న రైతుల తుది జాబితాను త్వరలో రూపొందిస్తామన్నారు. వచ్చే నెలలో జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. రైతుల సాగులో ఉన్న భూములు సింహాచలం దేవస్థానం పరిధిలో ఉన్నందున దేవస్థానం అధికారులతో కూడా ఉన్నతాధికారులు చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. పరిహారం విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ భరోసా ఇచ్చారు. పలువురు అధికారులు, స్థానిక గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు రైతు ఆధార్ 1-బి పత్రాలు ఇవ్వాలి



కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఏవో సోమశేఖర్

కె.కోటపాడు : రైతులకు పంట పెట్టుబడి సహాయం కింద రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులైన రైతులకు గుర్తించేందుకు రైతు సేవా కేంద్రాల్లో వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతున్నట్టు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమం మండలంలో గల 22 గ్రామ రైతు సేవా కేంద్రాల్లోనూ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని మంగళవారం ఆయన కె.సంతపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ కె.కోటపాడు మండలంలో 22 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ పథకానికి సంబంధించి 19,387 మంది రైతుల వివరాలు వ్యవసాయశాఖ సహాయకుల లాగిన్‌లకు వచ్చినట్టు తెలిపారు. రైతులు వారి ఆధార్, 1-బి పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లో గల వ్యవసాయశాఖ సహాయకులను సంప్రదించాలని తెలిపారు. భూ వివరాలు ఆధార్ నంబర్‌తో జత అయి ఉంటే వెంటనే వారి వివరాలకు వ్యవసాయశాఖ సహాయకులు అప్రూవల్ ఇవ్వనున్నట్టు తెలిపారు. 1-బి వివరాలు, రైతు ఆధార్ అనుసంధానం కాకపోతే మరలా వ్యవసాయశాఖ సహాయకులు రెవెన్యూ అధికారులకు పంపించనున్నట్టు తెలిపారు. ఇప్పటివరకూ మండలంలో 22 రైతు సేవా కేంద్రాల్లోను 9500 మంది రైతుల వివరాలను అప్రూవల్ చేయడం జరిగిందన్నారు.

పరిహారం తేలాకే భూ సర్వే చేయాలి

తహసీల్దార్‌కు రైతుల స్పష్టీకరణ



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

రావికమతం : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి బ్యాలెన్స్ రిజర్వాయర్ ఏర్పాటుకు సంబంధించి, సర్వేకు సంబంధించి, రెండో రోజు మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ పైలా రాజు తదితర రైతులతో తోటకూరపాలెం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో పాటు ఎంపీపీ పైల రాజు మాట్లాడుతూ తమకు డీపీఆర్ ఎక్కడ నుంచి ఎక్కడ వరకూ ఎన్ని భూములు తీసుకుంటున్నదీ ముందుగా తెలియజేయాలని ఎంపీపీ పేర్కొన్నారు. గ్రామంలోకి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులతో కలిసి సమీక్షలు నిర్వహించి, భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం, ఉపాధికి స్పష్టమైన హామీ ఇవ్వాలని, అప్పుడే తమ భూములు సర్వే చేయడానికి అంగీకరిస్తామని రైతులు తహసీల్దార్‌కు స్పష్టం చేశారు.